ప్రాజెక్టు కడితే ఉరే గతి



పాపాల పెద్దిరెడ్డి, మా ఉసురే నీకు శాపం.. అంటూ ఫ్లెక్సీ ఒకవైపు. గతంలో సీతమ్మ చెరువు వద్ద ఉన్న గుడి, పచ్చటి ప్రాంతాలతో మరో ఫ్లెక్సీ ఇంకో వైపు. ఉరితాళ్లు కట్టి.. వాటి ముందు నిలబడి ఉన్న రైతులు మరో వైపు. ఇది సోమవారం సోమల మండలం సీతమ్మచెరువు వద్ద పరిస్థితి. ఇక్కడి సందర్శనకు వచ్చిన మంత్రి రాంప్రసాద్‌రెడ్డి దృష్టికి తమ సమస్యలను తీసుకెళ్లడానికి ఇలా రైతులు వినూత్న కార్యక్రమం చేపట్టారు. ఆవులపల్లె రిజర్వాయరు నిర్మిస్తే వందలాది మంది భూములు కోల్పోతామని, ఇప్పటికే తీవ్రంగా నష్టపోయామని వారు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ ప్రాజెక్టుకు ప్రభుత్వం అనుమతిస్తే తమకు ఉరే గతని పేర్కొన్నారు.

- సోమల

రెండున్నరేళ్ల తర్వాత...

పోలీసుల సహకారంతో 2022లో తొలగించిన టీడీపీ జెండాను చౌడేపల్లె బస్టాండులో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, పార్టీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి సోమవారం ఆవిష్కరించారు. రెండున్నరేళ్లుగా కనీసం టీడీపీ ఫ్లెక్సీలను సైతం ఏర్పాటు చేయడానికి వీల్లేదని అడ్డుకున్నారు. ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడడంతో ఇప్పుడు టీడీపీ జెండాలు, తోరణాలతో బస్టాండులో పసుపు వాతావరణం నెలకొంది. ఈ జెండా ఆవిష్కరణకు కొందరు వైసీపీ నాయకులు, మాజీ వలంటీర్లు హాజరుకావటం విశేషం. మంత్రికి సోమవారం శెట్టిపేట వద్ద టీడీపీ మండలాధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి, యువనేత ప్రదీప్‌రాజు ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. అక్కడ టీడీపీ నేత మాదిరాజు లక్ష్మణరాజు (పతిరాజు) తన సొంత నిధులతో నిర్మించిన మోక్షగణపతి ఆలయంలో పూజలు నిర్వహించారు. అక్కడ్నుంచి టీడీపీ శ్రేణులు భారీగా ద్విచక్ర వాహనాలతో ర్యాలీగా చౌడేపల్లెకు చేరుకుని జెండా ఆవిష్కరించారు.

- చౌడేపల్లె



మారని పోలీసులు మార్చని ప్రభుత్వం



వైసీపీ ఐదేళ్ల పాలనలో జిల్లా టీడీపీ శ్రేణులు పోలీసుల వేధింపులతో నరకం చూశారు. అక్రమ కేసులతో ఊర్లను విడిచారు. టీడీపీ శ్రేణులపై పెట్టిన అక్రమ కేసుల్లో రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానంలో ఉంటుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇప్పుడు ప్రభుత్వం మారినా, టీడీపీ శ్రేణుల పరిస్థితి మాత్రం మారలేదు. రెండు నెలలవుతున్నా.. పోలీసు అధికారుల బదిలీలు జరగకపోవడంతోనే సమస్య వచ్చి పడింది. నాటి పోలీసులంతా వైసీపీకి అనుకూలంగా ఉంటూ, టీడీపీ శ్రేణుల్ని నిబంధనల పేరుతో ఇబ్బందులు పెడుతున్నారు. ఎలాగూ బదిలీ అయిపోతాం కదా అని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో అధికారంలో ఉండి కూడా రోడ్డెక్కి నిరసనలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

- క్షేత్రస్థాయిలో కూటమి నాయకుల ఇబ్బందులు
- అధికారంలో ఉంటూ ధర్నాలు చేసే పరిస్థితి
- పలమనేరు, ఎస్‌ఆర్‌పురం, తవణంపల్లెల్లో వరుస ఘటనలు

రెండుసార్లు సస్పెండైనా తీరు మారని ఎస్‌ఐ

ఎన్నికలకు ముందు జరిగిన బదిలీల్లో పెనుమూరుకు వెళ్లిన ఎస్‌ఐ లోకేశ్ ఎన్నికల సమయంలో వైసీపీకి అనుకూలంగా పనిచేశారని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. ఈయన ఎక్కువగా సివిల్ పంచాయితీల్లో జోక్యం చేసుకుని, కేసులు పెడతారనే ఆరోపణలున్నాయి. టీడీపీ గెలిచినప్పుడు స్థానిక శ్రేణులు పెనుమూరు బస్టాండులో సంబరాలు చేసుకుంటుండగా.. అడ్డుకుని ఇబ్బంది పెట్టినట్లు తెలుస్తోంది. ఎన్నికల ఫలితాలను ఓ ఇంట్లో కూర్చొని వీక్షిస్తున్న టీడీపీ శ్రేణుల వద్దకెళ్లి 'గుంపుగా కనిపించినా, సంబరాలు చేసుకున్నా.. కాళ్లు విరగ్గొట్టి కేసులు పెడతాన'ని బెదిరించినట్లు టీడీపీ వాళ్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఓ టీడీపీ నేత తన పొలంలో ఎక్స్‌కవేటరుతో పనిచేస్తుండగా.. ఏదో ఫిర్యాదు అందిందని జేసీబీని స్టేషన్‌కు తరలించారు. రెవెన్యూ వాళ్లకు కనీస సమాచారం ఇవ్వలేదు. రోజంతా స్టేషనులోనే ఉండి ఎంతగా అడుకున్నా కేసు పెట్టారు. 'దళితులైన మమ్మల్ని ఎస్‌ఐ ఇబ్బంది పెడుతున్నాడ'ని బాధితులు చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో కన్నీరుమున్నీరయ్యారు. ఎస్‌ఐ మీద ఎక్కువగా ఆరోపణలు రావడంతో తాజాగా ఎస్పీ మణికంఠ పెనుమూరు స్టేషన్‌ను తనిఖీ చేశారు. మరుసటి రోజే ఎస్‌ఐను వీఆర్‌కు పంపించారు. చిత్తూరు టూటౌన్‌లో ఉన్నప్పుడు బంగారం రికవరీ కేసులో రూ.లక్ష లంచం తీసుకుని సీఐ యతీంద్రతో పాటు ఎస్‌ఐ లోకేశ్ కూడా సస్పెండైన విషయం తెలిసిందే. వెదురుకుప్పంలో ఉన్నప్పుడు ఇతడి అవినీతిని ఎత్తిచూపిన పాత్రికేయుల మీద కూడా అక్రమ కేసులు పెట్టారు. దీంతో ఉన్నతాధికారులు అప్పుడూ ఆయన్ను వీఆర్‌కు పంపించారు. నాలుగేళ్ల సర్వీసున్న లోకేశ్ రెండు సార్లు సస్పెండ్, రెండుసార్లు వీఆర్‌కు వెళ్లారు.

పలమనేరు సీఐ తీరును నిరసిస్తూ..

పలమనేరు సీఐ చంద్రశేఖర్ ఎస్‌ఐగా ఉన్నప్పటి నుంచీ ఏళ్లుగా అదే నియోజకవర్గంలో పనిచేస్తున్నారు. ఈయన మీద వైసీపీకి అనుకూలమనే ముద్ర బలంగా ఉంది. వైసీపీ హయాంలో కేటిల్‌ఫాం సమీపంలోని కౌండిన్య నదిలో పంప్ హౌస్ వద్ద వైసీపీ నాయకులు పూర్తిగా ఇసుకను లోడేశారు. కర్ణాటకకు తరలించి బాగా సంపాదించుకున్నారు. అప్పట్లో టీడీపీ నాయకులు ఎక్స్‌కవేటర్లు, ట్రాక్టర్లను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. 'వాహనాలను ఆపేందుకు మీరెవరు, మేమున్నాం కదా' అని ఈ సీఐ సూచనల మేరకు పోలీసులు టీడీపీ నాయకుల్ని తప్పుపట్టారు. కనీసం చిన్నపాటి కేసు కూడా పెట్టలేదు. ఇదిలా ఉంటే, తాజాగా పలమనేరు మండలానికి చెందిన పెద్దబ్బ అనే టీడీపీ నేత రెండు ట్రాక్టర్ల ఇసుకను ఇంటి నిర్మాణానికి తీసుకెళ్తుండగా.. సీఐ ఆ ట్రాక్టర్లను అడ్డగించి నిబంధనల పేరుతో స్టేషన్‌కు తరలించారు. 'గతంలో కర్ణాటకకు ఇసుకను తరలించిన అక్రమార్కుల్ని పట్టుకోలేదు. ఇప్పుడు నిబంధనలు గుర్తొచ్చి మా ట్రాక్టర్లను పట్టుకుని లంచం అడుగుతున్నారు. డ్రైవర్లను దూషించారు.' అంటూ వంద మందికిపైగా టీడీపీ శ్రేణులు పలమనేరు స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. లోకేశ్ యువగళం పాదయాత్రకు ఉన్నతాధికారుల సహకారంతో ఈయన అడ్డంకులు సృష్టించినట్లు టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు.



పలమనేరు పోలీసు స్టేషన్ ముందు శనివారం ధర్నా చేస్తున్న టీడీపీ నేతలు

వైసీపీ ఎర్రచందనం దొంగను వదిలేసి..

ఎస్‌ఆర్‌పురం మండలం పిళ్లారికుప్పంలోని ఓ తోటలో పెంచిన ఎర్రచందనాన్ని అటవీ శాఖ వారి అనుమతిలో రైతు కోసి పెట్టారు. రూ.7 లక్షలు విలువైన ఈ దుంగల్ని వైసీపీకి చెందిన ఐదుగురు దొంగలించినట్లు స్థానికంగా చెబుతున్నారు. పోలీసులకు సమాచారం ఇచ్చినా ఎస్‌ఐ కుళ్లాయప్ప కేసు నమోదు చేయలేదని సుమారు 200 మంది టీడీపీ శ్రేణులు ఆదివారం రాత్రి స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. దీంతో అదే మండలానికి చెందిన వైసీపీ మాజీ ప్రజాప్రతినిధిని స్టేషన్‌కు పిలిచి 41ఏ నోటీసు ఇచ్చేసి వదిలేసినట్లు సమాచారం. టీడీపీ శ్రేణుల ధర్నా కారణంగా ఆ ప్రజాప్రతినిధిని కాకుండా చిన్నస్థాయి వ్యక్తుల్ని అదుపులో పెట్టుకున్నట్లు తెలుస్తోంది. వైసీపీ ముద్ర ఉన్న ఈ ఎస్‌ఐ లౌక్యంగా వ్యవహరించడం లేదని, స్టేషనులోనే సిబ్బంది కూడా సపోర్ట్ చేయడం లేదని ఉన్నతాధికారులు చెబుతున్నారు.

తవణంపల్లెలో టీడీపీ నేతల నిరసన

తవణంపల్లె: తవణంపల్లె ఎస్‌ఐ అనిల్‌కుమార్ తీరును నిరసిస్తూ టీడీపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం పోలీసు స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. టీడీపీ కార్యకర్తలను కౌన్సిలింగ్ పేరుతో ప్రతి రోజు స్టేషనుకు పిలిచి వేధిస్తున్నారని ఆరోపించారు. పోలీస్ స్టేషన్ బయటే నిలబెట్టి మాట్లాడడం వంటి చర్యలకు పాల్పడుతున్నారన్నారు. వీటిపై చర్చించడానికి మండలంలోని నేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున పోలీసు స్టేషనుకు చేరుకొన్నారు. ఎస్‌ఐ అందుబాటులో లేకపోవడంతో అక్కడే బైఠాయించారు. చిత్తూరు తాలూకా సీఐ శ్రీనివాసులు సంఘటనా స్థలం చేరుకొని టీడీపీ నేతలతో చర్చించారు. ఎస్‌ఐని సరెండర్ చేస్తున్నామని సర్ది చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. మండల టీడీపీ అధ్యక్షుడు గాలి దిలీప్, మాజీ జడ్పీటీసీ వెంకటేష్‌చౌదరి, మాజీ వైస్ ఎంపీపీ భాస్కర్‌నాయుడు, నాయకులు అమరేంద్ర నాయుడు, రవిచంద్రారెడ్డి, గోపి, శరవణ, వినాయకలతో పాటు పలువురు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సీఐ శ్రీనివాసులతో చర్చిస్తున్న టీడీపీ నాయకులు

వెంటనే 'ఆదరణ' పనిముట్లు అందించండి

సదస్సులో కలెక్టర్‌కు సీఎం చంద్రబాబు ఆదేశం ● వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా అధికారులు



చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 5: కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో తొలిసారిగా సోమవారం రాష్ట్రస్థాయి కలెక్టర్ల సదస్సు నిర్వహించింది. వెలగపూడిలోని సచివాలయంలో జరిగిన ఈ సదస్సులో కలెక్టర్ సుమిత్ కుమార్ ఉదయం నుంచి సాయంత్రం వరకు.. ఎస్పీ మణికంఠ సాయంత్రం పాల్గొన్నారు. ఈ సదస్సులో సీఎం చంద్రబాబు నాయుడు జిల్లా గురించి ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ బీసీల్లో వారసత్వంగా వచ్చే వృత్తులను ప్రోత్సహించడానికి గతంలో టీడీపీ ప్రభుత్వం ద్వారా ఆదరణ పథకం కింద పనిముట్లు అందించామన్నారు. అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు... గత ప్రభుత్వం చిత్తూరు జిల్లాలో లబ్ధిదారులకు ఈ పనిముట్లు అందించకుండా పక్కన పెట్టిందన్నారు. వాటిని వెంటనే లబ్ధిదారులకు అందజేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు. కాగా, రాష్ట్రస్థాయి కలెక్టర్ల సదస్సు వీడియో కాన్ఫరెన్స్‌ను సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో రిలే జరిగింది. ఇందులో జిల్లా అధికారులందరూ పాల్గొన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు జిల్లా అధికారులు పాల్గొనేందుకు కలెక్టర్ మినహాయింపు ఇస్తూ ద్వితీయ స్థాయి అధికారులు హాజరుకావాలని ఆదేశించారు.

కుప్పం రెస్కోలో విజిలెన్స్ తనిఖీలు



రెస్కోలో ఫైళ్లను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

కుప్పం, ఆగస్టు 5: కుప్పం రెస్కోలో సోమవారం మధ్యాహ్నం విజిలెన్స్ అధికారులు తనిఖీలు జరిపారు. విజిలెన్స్ సీఐ కె.సుబ్రమణ్యం, ఎస్‌ఐలు వెంకటచిన్న, ధరణీధర్ సిబ్బంది కలిసి విచారణ చేపట్టారు. ఫైళ్లను పరిశీలించారు. తొలుత జూలై 15న విజిలెన్స్ అధికారులు ఫైళ్లను పరిశీలించారు. రెస్కోలో అక్రమ నియామకాలు, అడ్డగోలు పదోన్నతులు, అక్రమాలపై అప్పటి సంస్థ ఎండీతో పాటు జిల్లా, డివిజన్ స్థాయి సహకార శాఖ అధికారులు, ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్‌లోని కీలక ఉద్యోగి విషయంలో అనేక అనుమానాలు నెలకొన్నాయి. వీరికి సంబంధించి కీలక ఆధారాలు అప్పట్లో విజిలెన్స్ అధికారులకు లభించినట్లు సమాచారం. దీనికి సంబంధించి ఇంకా మిగిలిపోయిన అనుమానాలను నివృత్తి చేసుకోవడానికి విజిలెన్స్ అధికారులు రెండోసారి చేపట్టిన తనిఖీలు సోమవారం రాత్రి వరకు కొనసాగాయి. రెస్కో ప్రస్తుత ఎండీ సోమశేఖర్‌తోపాటు మాజీ, ప్రస్తుత ఎండీలు సుబ్రమణ్యం, ప్రభాకర్, ఇతర ఉద్యోగులను కూడా విచారించినట్లు తెలిసింది. కాగా, ఇప్పటికే సహకార సంఘాల అదనపు రిజిస్ట్రార్ కె.శ్రీలక్ష్మి విచారణాధికారిగా నియామకం కావడంతోపాటు ఆమె రెండుమార్లు ఇప్పటికే రెస్కో కార్యాలయంలో విచారణ జరిపి వెళ్లిన విషయం తెలిసిందే.

అభివృద్ధి, అవినీతిపై చర్చకు సిద్ధమా?

- పెద్దిరెడ్డికి మంత్రి సవాల్
- రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటాం
- పుంగనూరు ప్రజా దర్బార్‌లో రాంప్రసాద్‌రెడ్డి



ప్రజాదర్బార్‌లో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

పుంగనూరు, ఆగస్టు5: పుంగనూరు నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, అవినీతిపై చర్చకు సిద్ధమా అంటూ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి మంత్రి రాంప్రసాదరెడ్డి సవాల్ విసిరారు. పెద్దిరెడ్డి బాధితులకు తమ ప్రభుత్వం న్యాయం చేస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. సోమవారం సాయంత్రం పుంగనూరు జీడీ్స అతిథిగృహంలో ప్రజా దర్బార్, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వైసీపీ పాలనలో వ్యవస్థల్లో జరిగిన లోపాలను సరిదిద్ది రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టామన్నారు. పూర్వీకుల ఆస్తులను ఇతరులకు మార్చడం, ఆన్‌లైన్‌లో మార్పులు, రికార్డుల తారుమారు తదితరాలపై రెవెన్యూ అధికారులు దృష్టిపెట్టి అర్హులకు న్యాయం చేయాలన్నారు. జేసీ శ్రీనివాసులు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో 23 క్వారీలకు అనుమతులిస్తే ఏడు పని చేస్తున్నాయన్నారు. నేతిగుంటపల్లె, ఆవులపల్లె, ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ గ్రీన్ ట్రైబ్యునల్ ఆదేశాలతో గతేడాది నుంచి పనులు నిలిపేసినట్లు ఎస్‌ఈ తెలిపారు. పుంగనూరులో పెద్దిరెడ్డి నిర్మించిన ప్రాజెక్టుల్లో ఒక్కదానికైనా రైతులకు పరిహారం అందజేయలేదని టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి విమర్శించారు. ఈ సందర్భంగా వందలాది మంది భారీ ఎత్తున మంత్రికి వినతులు అందజేశారు. పలమనేరు సబ్‌కలెక్టర్ మనోజ్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ విజయకుమార్, మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి, ఎక్సైజ్ అధికారి అయిషాబేగం, టీడీపీ మాజీ ఇన్‌చార్జి వెంకటరమణరాజు, నాయకులు శ్రీకాంత్, మాధవరెడ్డి, సుబ్రహ్మణ్యంరాజు, దినేశ్, ఆర్వీటీ బాబు, గువ్వల రమేశ్‌రెడ్డి, సీవీరెడ్డి, పోలీస్‌గిరి, రామయ్య, వెంకటమునియాదవ్, సుకుమార్, కేబీడీ సుగర్స్ ప్రెసిడెంట్ ఇంద్రప్రకాశ్, ప్రకాశ్, ఇబ్రహీం, శ్రీనివాసులురెడ్డి, పోలీ, చంద్ర, ప్రసాద్, జనసేన నేతలు పడగాల రమణ, విరూపాక్షి, హరినాయక్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

'మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబం, మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డిపై మా ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడదు. పోలీసు, అధికార వ్యవస్థలను అడ్డం పెట్టుకుని లూటీ చేసిన వైసీపీ నాయకులకు రాజ్యాంగబద్ధంగా కోర్టుల ద్వారా శిక్ష తప్పదు. ఏడాది కిందట పుంగనూరులో టీడీపీ కార్యకర్తలు, ప్రజలను అన్యాయంగా జైలుకు పంపిన పెద్దిరెడ్డి కుటుంబం.. అదే జైళ్లకు వెళ్లడానికి సిద్ధంగా ఉండాలి' అని రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చెప్పారు.

మంత్రి పర్యటనలో దొంగల ముఠా



నిందితుడు

చౌడేపల్లె/పుంగనూరు రూరల్: మంత్రి రాంప్రసాద్ రెడ్డి పర్యటన సందర్భంగా నెల్లూరుకు చెందిన దొంగల ముఠా చేతివాటం చూపింది. చౌడేపల్లె మండలంలో టీడీపీ అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి వద్ద రూ.లక్ష, సుబ్రహ్మణ్యం రూ.17వేలు, ఇబ్రహీం రూ.4900, రవినాయుడు రూ.50 వేలు, కృష్ణప్ప ఒక సెల్ ఫోన్‌తో పాటు రూ. 4000, హరిప్రసాద్ రూ.15వేలు పోగొట్టుకున్నారని ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. కాగా, మంత్రి సోదరుడితో పాటు పలువురి జేబులను దొంగలు ఖాళీ చేశారు. ఇక, పుంగనూరు సమావేశంలో దొంగలు మరో నాయకుడి జేబులో చేతులు వేయగానే గుర్తించి పట్టుకున్నారు. అతడికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు.

పోలీసుల వైఫల్యం

ప్రజాదర్బార్‌కు వచ్చిన వందలాది మంది మంత్రి ఉన్న వేదికపైకి చొచ్చుకొచ్చినా.. అధికారులపై అర్జీదారులు పడిపోతున్నా పోలీసులు పట్టించుకోలేదు. ఏమాత్రం నియంత్రించలేదు. కానీ, మంత్రి రాకముందే వివిధ మార్గాల్లో మాత్రం వాహనాల రాకపోకలను ఆపేసి ప్రజలను ఇబ్బంది పెట్టారు.

ఐటీఐల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు, ఆగస్టు 5: జిల్లాలోని ఏడు ప్రభుత్వ, పది ప్రైవేటు ఐటీఐల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ రవీంద్రారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు iti.ap.gov.in అనే వెబ్‌సైట్‌లో ఈనెల 26లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 7799933370ను సంప్రదించాలని కోరారు. ప్రభుత్వ ఐటీఐలకు ఈనెల 29న, ప్రైవేటు ఐటీఐలకు ఈనెల 31న కౌన్సెలింగ్ ఉంటుందని వెల్లడించారు.

మాజీ ఉద్యోగులకు పెన్షన్లు ఇంకా రాలేదు

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 5: ప్రభుత్వ పెన్షన్‌దారులకు 6వ తేదీ అవుతున్నా ఇంతవరకు పింఛన్ మొత్తాలు విడుదల కాలేదు. జిల్లావ్యాప్తంగా 12,505 మంది ప్రభుత్వ పెన్షనర్లు ఉన్నారు. ఖజానా ఎస్టీవోలు ప్రభుత్వ పెన్షనర్ల పింఛన్ బిల్లులు గత నెల 24వ తేది అప్రూవ్‌చేసి డేటా పంపారు. సీఎఫ్ఎంఎస్ బిల్లులను 30న పరిశీలించి, తిరిగి ఎస్టీవోలకు పంపగా వాటిని వారు ఓకే చేసి టోకెన్లు మంజూరు చేశారు. 31న సీఎఫ్ఎంఎస్ పెన్షన్లు చెల్లింపులకు ఆమోదం తెలిపి ఈ-కుబేర్‌కు పంపింది. కానీ ఉద్యోగులకు జీతాలు ఈనెల ఒకటిన పడినా, పెన్షన్లు మాత్రం జమ కాలేదు.

కేంద్రీయ విద్యాలయ ఏర్పాటులో ముందడుగు

● స్థలాన్ని పరిశీలించిన కేంద్ర బృందం



స్థల పరిశీలన చేస్తున్న కేంద్ర బృందం

చిత్తూరు సిటీ/చిత్తూరు రూరల్, ఆగస్టు 5: చిత్తూరులో కేంద్రీయ విద్యాలయ ఏర్పాటుకు ముందడుగు పడింది. సోమవారం కేంద్ర బృందం స్థలాన్ని పరిశీలించింది. వైసీపీ హయాంలోనే మంజూరైనా స్థలాన్ని చూపించడంలో అప్పటి ప్రజా ప్రతినిధులు, అధికారులు విఫలమయ్యారు. కూటమి అధికారంలో వచ్చాక ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్‌రావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ వేర్వేరుగా కేంద్రీయ విద్యాలయ అధికారులకు లేఖలు రాశారు. ఈ క్రమంలో కేంద్రీయ విద్యాలయ రీజనల్ కోఆర్డినేటర్ మంజునాథ్ నేతృత్వంలోని త్రిసభ్య కమిటీ మంగసముద్రంలో కార్పొరేషన్ అధీనంలోని స్థలాన్ని సందర్శించారు. భూమి పత్రాలను పరిశీలించారు. ఆర్డీవో చిన్నయ్య, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ రామకృష్ణుడు, తహసీల్దార్ కళావతి, పీఎన్‌సీ మునిసిపల్ హైస్కూల్ హెచ్ఎం వేదవతి కమిటీకి అవసరమైన సమాచారం అందించి, వారి సందేహాలను నివృత్తి చేశారు. ఎమ్మెల్యే గురజాల సూచనల మేరకు టీడీపీ నేతలు వసంత్ కుమార్, ముత్తు రవితేజ, ఈశ్వర్, మధుబాబు, చిట్టి బాబు, కోడిబాబు తదితరులు అధికారులకు అవసరమైన ఏర్పాట్లను చేశారు.

టీడీపీ నేతలపై దాడులు

● వైసీపీకి చెందిన సర్పంచిపై బాధితుల ఫిర్యాదు



గాయపడిన గుణశేఖర్

వెదురుకుప్పం, ఆగస్టు 5: వెదురుకుప్పం మండలం తిప్పినాయుడుపల్లె సర్పంచి రాజశేఖరరెడ్డి తమపై దాడులకు, మారణాయుధాలతో దౌర్జన్యం చేస్తున్నారని టీడీపీ నేత విజయనరసింహారెడ్డి, టీడీపీ ఎస్సీ నాయకుడు గుణశేఖర్ సోమవారం తెలిపారు. తనపై ఆదివారం జరిగిన దాడికి సంబంధించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు గుణశేఖర్ తెలిపారు. 'తిప్పినాయుడుపల్లె కాలనీకి చెందిన నేను టీడీపీ నేతను. ఆటో నడుపుకొంటున్నా. మా సర్పంచి రాజశేఖర్‌రెడ్డి గ్రామ సమీపంలో మట్టి అక్రమ రవాణాకు పాల్పడటంపై అధికారులకు చెప్పినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో ఆదివారం సాయంత్రం నేను ఆటోలో తిప్పినాయుడుపల్లె కాలనీకి వెళ్తుండగా రెండు ట్రాక్టర్లు, రెండు ఎక్స్‌కవేటర్లను అడ్డుపెట్టి అటకాయించాడు. కులం పేరుతో దూషించి, చంపేస్తానని బెదిరించాడు. అనుచరులతో కలసి నాపై దాడి చేశాడు. ప్రాణభయంతో పరుగులు పెట్టిన నన్ను కొందరు 108 అంబులెన్స్ ద్వారా చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సోమవారం వచ్చి సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి, ఆయన వర్గీయులపై పోలీసులకు ఫిర్యాదు చేశాను' అని గుణశేఖర్ చెప్పారు.

● తనపైనా సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి, అనుచరులు ఆదివారం మారణాయుధాలతో దాడికి వచ్చారని, ఆ సమయంలో గ్రామస్తులు ఉండటంతో ప్రాణాలతో బయట పడ్డానని తిప్పినాయుడుపల్లెకు చెందిన టీడీపీ నేత విజయనరసింహారెడ్డి తెలిపారు. అతడిపై రౌడీషీట్ ఓపెన్ చేయాలని కోరారు. లేకపోతే అతడి వల్ల స్థానికంగా చాలా మందికి ప్రాణహాని ఉందన్నారు.

'నిబంధనల మేరకే సీనియారిటీ జాబితా'

చిత్తూరు రూరల్, ఆగస్టు 5: నిబంధనల మేరకే జడ్పీలో సీనియారిటీ జాబితాను రూపొందించారని, ఇందులో అవకతవకలు జరగలేదని పీఆర్ మినిస్టీరియల్ అసోసియేషన్ నాయకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొంత మంది అనర్హులు జిల్లా అసోసియేషన్‌ను అప్రతిష్టపాలు చేసేందుకు, పదోన్నతులు నిలుపుదల చేయడానికి అసత్యప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ సంవత్సరం కూడా సీనియారిటీ జాబితాను పంపించామని తెలిపారు.

పోలవరం ప్రాజెక్టులో దోపిడీ: ఆర్సీవై

పుంగనూరు, ఆగస్టు 5: పోలవరం ప్రాజెక్టులో గడిచిన కొన్నేళ్లుగా దోపిడీ తప్ప పనుల్లో ప్రగతి కనిపించలేదని బీసీవై పార్టీ అధినేత రామచంద్రయాదవ్ ఆరోపించారు. సోమవారం ఆయన పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులలను పరిశీలించినట్లు తెలిపారు. సాంకేతికంగా చేయాల్సిన పనులు చేయకుండా కమీషన్లు, కాసుల కోసం అత్యవసరంగా కొన్ని పనులు చేశారని మండిపడ్డారు. మొత్తం 1.06 లక్షల మందికి పునరావాసం కల్పించాల్సివుండగా 20 ఏళ్లగా కేవలం 12శాతం మందికి పునరావాసం కల్పించినట్లు తెలిపారు. ఆర్అండ్ఆర్ చట్టం ప్రకారం ప్రాజెక్టు పూర్తయ్యే సరికి 100శాతం పునరావాసం కల్పించాలన్నారు. కేంద్ర నిధులతో రానున్న రెండేళ్లలోపు ప్రాజెక్టు పూర్తిచేసి రైతులకు నీళ్ల అందించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నలుగురు 'ఎర్ర' స్మగ్లర్ల అరెస్టు

- 12 దుంగలు, రెండు బైక్‌ల స్వాధీనం



మంగళం, ఆగస్టు 5: నలుగురు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేసి.. 12దుంగలు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాలతో టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో డీఎస్పీ చెంచుబాబు సూచనలతో ఆర్ఐ చిరంజీవులుకు చెందిన ఆర్ఎస్ఐ నరేష్ టీమ్ స్థానిక అటవీశాఖ అధికారుల సాయంతో సోమవారం వెంకటగిరి ఫారెస్టు రేంజ్‌కి వెళ్లి డక్కిలి అటవీప్రాంతం వైపు, సీసీ కండ్రిగ వద్ద ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లను తనిఖీలు నిర్వహించారు. తెల్లవారుజామున వెంకటగిరి హిల్స్ వద్ద రెండు బైక్‌లపై కొందరు వ్యక్తులు కనిపించారు. వారిని చుట్టుముట్టగా పారిపోయే ప్రయత్నం చేశారు. వెంబడించి నలుగురిని పట్టుకున్నారు. వీరిని వెంకటగిరి మండలానికి చెందిన వెంకటేష్(44), పారవోలు పెంచలయ్య(42), త్రిపురాంతపల్లి వెంకటేష్(44),రేణిగుంట మండలానికి చెందిన కొల్లంగుంట సురేష్‌బాబు(39)గా గుర్తించారు. విచారించి, వారు దాచి ఉంచిన 12ఎర్రచందనం దుంగలను, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. పరారైన మిగిలినవారి కోసం గాలిస్తున్నారు. స్మగ్లర్లను తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించి, సీఐ సురేష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జనబాహుళ్యంలోకి సంస్కృత విజ్ఞానం

సిద్ధాంత సంస్థతో ఎన్ఎస్‌యూ పరస్పర చర్చలు

తిరుపతి రూరల్, ఆగస్టు 5: సంస్కృత విజ్ఞానాన్ని అధునాతన టెక్నాలజీ ద్వారా జన బాహుళ్యంలోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు జాతీయ సంస్కృత వర్సిటీ (ఎన్ఎస్‌యూ)తో చెన్నైకి చెందిన సిద్ధాంత నాలెడ్జ్ ఫౌండేషన్ ప్రతినిధులు సోమవారం పరస్పర అవగాహన చర్చలు జరిపారు. వర్సిటీ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి ఇతర అధికారులతో కలిసి సిద్ధాంత సంస్థ చైర్మన్ జయకృష్ణ, శాస్త్రవేత్తలు సుదర్శన్, లక్ష్మి, ఆత్రేయ సత్యనారాయణ, మేనేజర్ రాంబాబు పాల్గొన్నారు. వైదిక కృషి విజ్ఞానం, ప్రాచీనపాకశాస్త్రం, గణితం, సంస్కృత వినోదం, ప్రశ్నాశాస్త్రం, సిద్ధాంత జ్యోతిషం అంశాలపై చర్చించి, రానున్న రోజుల్లో వీటిపై ఎంవోయూ చేసుకోవాలని నిర్ణయించారు. రిజిస్ట్రార్ ఆర్‌జే రమాశ్రీ, అధ్యాపకులు కేఎస్ సతీశ, గణపతిభట్, శంకర్‌నారాయణ, సూర్యనారాయణ, చంద్రశేఖరం తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌కు 196..పోలీసు శాఖకు 39 అర్జీలు







అర్జీలు స్వీకరిస్తున్న డ్వామా పీడీ రాజశేఖర్, డీఆర్‌డీఏ పీడీ తులసి-కలెక్టరేట్ వద్ద స్కీం వర్కర్ల నిరసన-నిరసన తెలుపుతున్న మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్లు

చిత్తూరు, ఆగస్టు 5: కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాల్లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి బాధితులు హాజరయ్యారు. డ్వామా పీడీ రాజశేఖర్, డీఆర్‌డీఏ పీడీ తులసీ, డిప్యూటీ కలెక్టర్ భవానీ వినతులు స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కలెక్టరేట్‌కు 196.. పోలీసు శాఖకు 39 అర్జీలు వచ్చాయి. వాటిలో కొన్ని..

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

జిల్లాలో తొలగించిన స్కీం వర్కర్లు, వీవోఏ, ఆర్‌పీలు, మధ్యాహ్న భోజన కార్మికులు, ఉపాధి క్షేత్రస్థాయి సహాయకులు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ వర్కర్లను కూటమి ప్రభుత్వం వెంటనే విధుల్లోకి తీసుకోవాలని స్కీం వర్కర్ల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు గంగరాజు కోరారు. ఎలాంటి షోకాజ్ నోటీసులూ ఇవ్వకుండా 350 మందిని తొలగించడం అన్యాయమన్నారు. కలెక్టరేట్ వద్ద చేపట్టిన నిరసనలో సీఐటీయూ నేతలు సురేంద్రన్, గిరిధర్‌గుప్తా, ఓబుల్‌రాజు, లలిత, షకీలా, గంగ పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలి

ప్రభుత్వాస్పత్రుల్లోని శానిటరీ కార్మికులకు ఐదునెలల వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు నాగరాజన్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఆరేళ్లుగా యూని ఫాం ఇవ్వలేదని, ఈఎస్ఐ సేవలు అమలు కావడం లేదన్నారు. ఖాళీలను భర్తీ చేసి, కనీస వేతనం రూ.16 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు.



అర్జీని పరిశీలిస్తున్న ఏఎస్పీ ఆరీఫుల్లా

● తన కుమారుడు శివకుమార్ చౌకదుకాణ అనుమతిని పునరుద్ధరించాలని పలమనేరు గాంధీ నగర్‌కు చెందిన నాగరాజు కోరారు. పాఠశాలకు బియ్యం సక్రమంగా ఇవ్వలేదనే కారణంగా 2022లో దుకాణ నిర్వహణ బాధ్యత నుంచి తప్పించి వీఆర్‌ఏ ఆధ్వర్యంలో సరుకుల పంపిణీ జరుగుతోందన్నారు. జరిమానా విధించి, అనుమతి ఇవ్వాలని ఈ ఏడాది జనవరిలో జిల్లా యంత్రాంగం ఉత్తర్వులిచ్చినా అమలు కాలేదన్నారు.

● తమ అనుభవంలో ఉన్న భూముల్లో వ్యవసాయం చేయకుండా అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నారని సోమల మండలం సూరయ్యగారిపల్లె ఎస్సీకాలనీకి చెందిన రైతులు వాపోయారు. ఈ భూములు అగ్రకులస్థుల చేతిలో ఉన్నాయని, విచారణ జరిపి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

● పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 39 వినతులు వచ్చాయి. ఏఎస్పీ ఆరీఫుల్లా వినతిపత్రాలను స్వీకరించారు.

పొలాలను అటవీ భూములుగా మార్చారు

● పెద్దిరెడ్డిపై మంత్రి రాంప్రసాద్‌రెడ్డి విమర్శ



సీతమ్మ చెరువు వద్ద రైతులతో మాట్లాడుతున్న మంత్రి

సోమల, ఆగస్టు 5: రైతుల భూములను.. అటవీ భూములుగా రికార్డులు సృష్టించిన ఘనత పెద్దిరెడ్డికే దక్కుతుందని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి విమర్శించారు. సోమల మండలంలోని సూరయ్యగారిపల్లె, నంజంపేట, మల్లేశ్వరపురం, ఆవులపల్లెలో సోమవారం మంత్రి పర్యటించారు. సీతమ్మచెరువు రిజర్వాయర్ వద్దకు చేరుకున్న ఆయన.. పెద్దిరెడ్డి చేపట్టిన ప్రాజెక్టు పనులను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. చిన్న చెరువును ప్రాజెక్టుగా మార్చేందుకు రూ.800 కోట్లు మంజూరు చేయించుకుని స్వాహాచేసేలా ప్రయత్నించారని ఆరోపించారు. వందల ఏళ్ల నుంచి సాగులోని రెవిన్యూ భూములను అటవీశాఖకు చెందినవిగా రికార్డులు సృష్టించి రైతులను వేధించి, వారిపైనే అక్రమ కేసులు పెట్టి జైలు పాలు చేశాడని విమర్శించారు. రైతులకు నష్టపరిహారం మంజూరు కాకనే పనులు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఆవులపల్లె, రామకృష్ణాపురం, బయ్యారెడ్డిపల్లె తదితర ముంపు భూముల రైతుల నుంచి వినతులు స్వీకరించారు. సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళతానని తెలిపారు. జేసీ శ్రీనివాసులు, ఇరిగేషన్ అధికారులతో మంత్రి సమీక్షించారు. పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి, బీజేపీ కన్వీనర్ గన్నా మదన్‌మోహన్ బాబు, టీడీపీ, జనసేన మండల అధ్యక్షులు సుబ్రమణ్యం నాయుడు, నాగభూషణం, మాజీ వైస్ ఎంపీపీ ఉమాపతి, శ్రీనివాసులు నాయుడు, హరిప్రసాద్, కామిశెట్టి నగేశ్, వేణుగోపాల్ నాయుడు, రమేశ్‌నాయుడు, బాలసుబ్రమణ్యం, శివశంకర్, విశ్వనాథం, లక్ష్మీపతి నాయుడు, పట్టాభి నాయుడు, రవి నాయుడు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యంలో భారీ వర్షం







హైవేలో భారీగా నిలిచిన వర్షపునీరు, వర్షపునీటిలో నడుచుకుంటూ వెళ్తున్న విద్యార్థులు, ముంగరమడుగులో నీటమునిగిన వరి

బంగారుపాళ్యం, ఆగస్టు 5: ఒక్కసారిగా మేఘాలు కమ్ముకొన్నాయి. సోమవారం బంగారుపాళ్యంలో భారీ వర్షం కురిసింది. సుమారు రెండు గంటలసేపు ఏకధాటిగా కురవడంతో చిత్తూరు-పలమనేరు జాతీయ రహదారిలో భారీగా నీళ్లు చేరాయి. దీంతో విద్యార్థులు, వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. ఎప్పుడు వర్షం వచ్చినా ఈ రోడ్డులో భారీగా నీళ్లు నిలిచి.. పక్కనున్న దుకాణాలు, ఇళ్లల్లోకి చేరుతోంది. ముంగరమడుగు, జంబువారిపల్లి, ఎర్రాండ్లపల్లి, జయరామపురం, 170 గొల్లపల్లి తదితర గ్రామాల్లో రైతులు గత వారం క్రితం వేసిన వరిపంటల సుడుల వరకు వర్షపు నీటి చేరాయి. దీంతో వరిపంటలు వేసిన రైతులు తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

జిల్లావ్యాప్తంగా చిరుజల్లులు

చిత్తూరు కలెక్టరేట్: గడచిన 24 గంటల్లో జిల్లావ్యాప్తంగా చిరుజల్లులు కురుస్తున్నాయి. అత్యధికంగా పూతలపట్టులో 30.4, అత్యల్పంగా శ్రీరంగరాజపురంలో 0.8 మి.మీ వర్షపాతం నమోదైంది. నింద్రలో 15.2, విజయపురం 13.6, గంగాధరనెల్లూరు 13.2, చిత్తూరు రూరల్ 13.0, చిత్తూరు అర్బన్ 7.0, పాలసముద్రం 3.2, తవణంపల్లె 2.8, వెదురుకుప్పం 2.4, నగరి 2.2, గుడిపాల 2.2, యాదమరి 1.8, శాంతిపురం 1.2, పెనుమూరులో 1.0 మి.మీ వర్షపాతం నమోదైంది.

స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించాలి



అధికారులకు సూచనలిస్తున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 5: స్వాతంత్ర్య దిన వేడుకలను ఘనంగా నిర్వహించాలని జేసీ శ్రీనివాసులు జిల్లా అధికారులను ఆదేశించారు. పంద్రాగస్టు వేడుకల నిర్వహణపై సోమవారం రాత్రి ఆయన కలెక్టరేట్‌లో డ్వామా పీడీ రాజశేఖర్‌తో కలసి జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. ప్రభుత్వం నిర్ణయించిన ముఖ్య అతిథి హాజరై త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరిస్తారని, అనంతరం వారి ప్రసంగం, మాక్ డ్రిల్, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రశంసా పత్రాలందించడం తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. పరేడ్ కార్యక్రమాన్ని పోలీసు శాఖ నిర్వహించాలని, వేదిక ఏర్పాట్లను రెవిన్యూ డివిజినల్ అధికారి, స్థానిక తహసీల్దార్ పర్యవేక్షిస్తారని తెలిపారు. పలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇనుమడింపజేసేలా శకటాలను ప్రదర్శించాలని సూచించారు. శకటాల ప్రదర్శనకు ఆసక్తి చూపే శాఖల అధికారులు డ్వామా పీడీని సంప్రదించాలన్నారు. పోలీసు పరేడ్ మైదానంలో ఏర్పాటు చేస్తున్న ఎగ్జిబిషన్ స్టాల్స్‌కు ఆసక్తిచూపే శాఖల అధికారులు డీఆర్డీఏ పీడీ తులసిని సంప్రదించాలని సూచించారు. ఆస్తు ల పంపిణీ కార్యక్రమాన్ని డీఆర్డీఏ పీడీ పరిశీలించాలని సూచించారు. పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ జెండా, స్టేజ్ డెకరేషన్, సెక్యూరిటీ, పరేడ్‌కు సంబంధించిన ఏర్పాట్లను పోలీసుశాఖ, చిత్తూరు నగరపాలక సంస్థ పర్యవేక్షించాలని ఆదేశించారు. గ్రౌండ్‌లో మెడికల్ క్యాంపు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, సిబ్బందిని అందుబాటులో ఉంచాలని డీఎంహెచ్‌వోను సూచించారు. ఈ సమావేశంలో ఏఎస్పీ అరీఫుల్లా, డీఎస్వో శంకరన్, డీఎస్పీ మహబూబ్ బాషా, జడ్పీ సీఈవో గ్లోరియా, జిల్లా ఫైర్ ఆఫీసర్ పెద్దిరెడ్డి, నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ రామకృష్ణుడు, సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ డీఎం మోహన్‌బాబుతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

కర్ణాటక, పాండిచ్చేరి మద్యం స్వాధీనం

● ఇద్దరి అరెస్టు
● ద్విచక్ర వాహనం, బస్సు సీజ్





కర్ణాటక మద్యంతో పట్టుబడిన మంజునాథను అరెస్టు చూపుతున్న ఎస్ఈబీ పోలీసులు, పాండిచ్చేరి నుంచి మద్యం తీసుకొస్తున్న వ్యక్తిని, ప్రైవేటు బస్సును అదుపులోకి తీసుకొన్న అధికారులు

పలమనేరు, ఆగస్టు 5: కర్ణాటక, పాండిచ్చేరి నుంచి అక్రమంగా తీసుకొస్తున్న మద్యాన్ని సోమవారం పలమనేరు ఎస్ఈబీ పోలీసులు పట్టుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేశారు. ఎస్ఈబీ సీఐ సురేష్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. బైరెడ్డిపల్లె మండలం లక్కనపల్లెకు గ్రామానికి చెందిన మంజునాథ స్కూటర్‌లో 384 కర్ణాటక మద్యం టెట్రాప్యాకెట్లు తీసుకొస్తున్నాడు. పలమనేరులోని పద్మశ్రీ సర్కిల్ వద్ద అతడిని పట్టుకుని అరెస్టు చేశారు. స్కూటర్‌ను సీజ్ చేశారు. అలాగే, మదనపల్లెకు చెందిన కరమలాచారి అనే వ్యక్తి ప్రైవేటు ట్రావెల్స్‌లో పాండిచ్చేరికి చెందిన 120 మద్యం ఫుల్ బాటిళ్ల తీసుకొస్తున్నాడు. పలమనేరు సమీపంలోని ఫ్లైఓవర్ వద్ద పట్టుకొని, మద్యం స్వాధీనం చేసుకొని, నిందితుడిని అరెస్టు చేశారు. ట్రావెల్స్ బస్సును కూడా సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఈబీ ఎస్ఐ దత్తాత్రేయ, హెడ్‌కానిస్టేబుల్ దేవరాజులు, కానిస్టేబుళ్ల సతీష్‌బాబు, సయ్యద్‌బాషా, అల్తామస్, చక్రినాయక్, సుబ్బయ్య, మురళి పాల్గొన్నారని సీఐ తెలిపారు.

బోయకొండ గంగమ్మకు హుండీ ఆదాయం రూ.86 లక్షలు



ఆలయ హుండీని లెక్కిస్తున్న సిబ్బంది

చౌడేపల్లె, ఆగస్టు5: బోయకొండ గంగమ్మకు హుండీ లెక్కింపు ద్వారా రూ.86.85 లక్షలు ఆదాయం సమకూరినట్లు ఈవో ఏకాంబరం సోమవారం తెలిపారు. ఇంకా, 33 గ్రాముల బంగారు, 690 గ్రాములు వెండి, యూఎస్ఏ డాలర్ ఒకటి, బంగ్లాదేశ్ కరెన్సీ టకా 10, 20, 100 నోట్లు ఒక్కొక్కటి, సౌదీ అరేబియా కరెన్సీ ఒక రియాల్‌ను భక్తులు సమర్పించారన్నారు. ఈ ఆదాయం 37 రోజులలో వచ్చినట్లు తెలిపారు. రణబేరిగంగమ్మ ఆలయానికి హుండీ ద్వారా రూ.69,888 నగదు వచ్చిందన్నారు. గ్రూప్ టెంపుల్స్ ఇన్‌స్పెక్టర్ రవికిరణ్‌కుమార్‌రెడ్డి, ఆలయ సిబ్బంది, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకుడి మట్టిదందా

వెదురుకుప్పం, ఆగస్టు 5: మండలంలోని తిప్పినాయుడుపల్లె సర్పంచ్ రాజశేఖరరెడ్డి మట్టిదందాకు పాల్పడుతున్నాడని, ఈ విషయమై వీఆర్వోకు, పోలీసులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోయిందని తిప్పినాయుడుపల్లె టీడీపీ నాయకులు విజయనరసింహారెడ్డి, గుణశేఖర్ ఆరోపించారు. సోమవారం వెదురుకుప్పంలో వారు విలేకరులతో మాట్లాడుతూ రాజశేఖర్‌రెడ్డి తిప్పినాయుడుపల్లె పంచాయతీ పరిధిలో పలుచోట్ల మట్టి తవ్వకాలు చేపట్టి సొమ్ము చేసుకుంటున్నాడని తెలిపారు. ఇతర రాష్ట్రాలకు సైతం తరలిస్తున్నాడని చెప్పారు. లోపాయికారి ఒప్పందం వల్ల రెవెన్యూ యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరిస్తోందన్నారు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించి, అడ్డుకోకపోతే ఆందోళన చేయాల్సి వస్తుందని స్పష్టం చేశారు.

డెంగ్యూతో విద్యార్థిని మృతి

పుంగనూరు రూరల్, ఆగస్టు 5: మేలుపట్లలోని గిరిజన వసతి గృహంలో చదువుతున్న పూర్ణిమ(11) డెంగ్యూతో మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాలిలా ఉన్నాయి. సోమల మండలం 81చిన్న ఉప్పరపల్లె పంచాయతీ ఇర్లపల్లెకు చెందిన వెంకటరమణ, ఈశ్వరమ్మల కుమార్తె పూర్ణిమ గిరిజన వసతి గృహంలో ఏడో తరగతి చదువుతోంది. కొన్నిరోజులుగా జ్వరంతో ఇబ్బంది పడుతున్నా వార్డెన్ పట్టించుకోలేదని, వారంరోజుల తర్వాత తమకు సమాచారం ఇచ్చినట్లు తల్లిదండ్రులు తెలిపారు. పూర్ణిమను తల్లిదండ్రులు తీసుకెళ్లి సోమలలో ఆర్ఎంపీ వద్ద చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో తిరుపతికి తరలించగా, సకాలంలో తీసుకురాకపోవడంతో మృతి చెందినట్లు డాక్టర్లు చెప్పినట్లు తెలిసింది.

గ్రీవెన్స్ డేలో 25 ఫిర్యాదులు



ప్రజల ఫిర్యాదులపై ఆదేశాలిస్తున్న కడా పీడీ వికాస్ మర్మత్

కుప్పం, ఆగస్టు 5: మండల సచివాలయంలో సోమవారం కడా పీడీ వికాస్ మర్మత్ ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. ఇందులో ఆయనకు ప్రజలనుంచి మొత్తం 25 ఫిర్యాదులు అందాయి. ఇందులో 20 ఫిర్యాదులు రెవెన్యూ సమస్యలకు సంబంధించినవే ఉన్నాయి. ఈ సందర్భంగా కడా పీడీ మాట్లాడుతూ ప్రజలనుంచి వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తీసుకున్న చర్యల గురించి యాక్షన్ టేకెన్ రిపోర్ట్ ఇవ్వాలన్నారు. ఒకవేళ పరిష్కారం చేయలేకపోతే కారణాలను పేర్కొనాలన్నారు. అప్పుడు తన పరిధిలో పరిష్కారానికి ఎటువంటి చర్యలు తీసుకోవాలో పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాలకు చెందిన రెవెన్యూ, మండల పరిషత్తు, ఇతర ప్రభుత్వ విభాగాల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కుప్పం ఆర్డీవోగా శ్రీనివాసులు బాధ్యతల స్వీకరణ



కుప్పం, ఆగస్టు 5: కుప్పం ఆర్డీవోగా కె.శ్రీనివాసులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన భీమవరం నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడున్న జి.శ్రీనివాసులు ఇంతకుముందే బదిలీపై విజయవాడకు వెళ్లారు. బాధ్యతలు స్వీకరిస్తూనే ఆర్డీవో శ్రీనివాసులు గణేశ్‌పురం వద్ద ఉన్న న్యాక్ భవనంలోని ఆర్డీవో కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ

కుప్పం రూరల్, ఆగస్టు 5: మండలంలోని మల్లానూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, మండల టీడీపీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాలకు సంబంధించిన సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్య క్రమంలో టీడీపీ నాయకులు రామచంద్ర, దామోదర్, రాజేంద్ర, సంజీవి, వెంకటా చలపతి, అశోక్, రాజ్‌కుమార్, అన్నాదొరై, వెంకటేష్, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు రామకుప్పం మండల మీట్

రామకుప్పం, ఆగస్టు 5: రామకుప్పం మండలం సాధారణ సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ఈశ్వరయ్య తెలిపారు. ఉదయం 10గంటలకు మండల సచివాలయ సమావేశ మందిరంలో జరిగే ఈ సమావేశానికి మండల పరిధిలోని అందరు ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

ప్రతి పల్లెను అభివృద్ధి చేసుకుందాం : ఎమ్మెల్యే అమర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, ఆగస్టు5 : పలమనేరు మండలంలోని ప్రతిపల్లెనూ అభివృద్ధి చేసుకొందా మని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో మండ లంలోని పంచాయితీ స్థాయి నాయకులు, బూత్‌కమిటీ నాయకులతో సమా వేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాయకులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషిచేయాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలన్నారు. పంచా యితీల వారీగా ఉన్న సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించు కొందామన్నారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు నాగరాజరెడ్డి, ప్రధాన కార్యదర్శి గణేష్, బాలాజి నాయుడు, మల్లీశ్వరరెడ్డి, పెద్దబ్బ, స్వతంత్రబాబు, జనసేన నాయకులు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.49 వేల విరాళం



కుప్పం, ఆగస్టు 5: కుప్పం పురపాలక సంఘం పరిధిలోని కమతమూరు సచివాలయానికి చెందిన కనకదుర్గ వార్డు మహిళా సమాఖ్య మహిళలు రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.49 వేలు విరాళం ఇచ్చారు. సచివాలయంలో సోమవారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు వార్డు మహిళా సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు రూ.49 వేలు విలువ చేసే చెక్కును కమిషనర్‌కు అందించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ రాజధాని నిర్మాణం కోసం మహిళా గ్రూపు సభ్యులు సాయం అందించడం హర్షణీయమని పేర్కొన్నారు.

టీడీపీ నాయకుల అన్నదానం



రామకుప్పంలో టీడీపీ నేతలతో కలసికేక్ కట్ చేస్తున్న డా.సురేష్‌బాబు

రామకుప్పం, ఆగస్టు 5: టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్‌బాబు జన్మదిన వేడుకలను సోమవారం రామకుప్పంలో ఆ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు ఆంజినేయరెడ్డి, కేకేఆర్ ఎర్త్‌మూవర్స్ కేశవరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆటోస్టాండు సర్కిల్‌లో పార్టీ నేతలు డా.సురేష్‌బాబుచే కేక్ కత్తిరింపజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు స్వీట్లు పంచిపెట్టారు. టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పట్ర నారాయణాచారి, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధానకార్యర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ అధ్యక్షుడు ఆంజినేయరెడ్డి, బీజేపీ జిల్లా కార్యదర్శి రాజసింహ, జనసేన అధ్యక్షుడు హరీష్ పాల్గొన్నారు.

శాంతిపురం: డాక్టర్ సురేష్‌బాబు జన్మదిన వేడుకలను మండల పార్టీ కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సురేష్‌బాబుకు శాలువలు కప్పి సన్మానించారు. ఏఎంసీ మాజీ డైరెక్టర్ బసవరాజు సహకారంతో ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు స్వీట్లు, పుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు.

తహసీల్దారుగా చిట్టిబాబు బాధ్యతల స్వీకరణ



కుప్పం, ఆగస్టు 5: కుప్పం తహసీల్దారుగా చిట్టిబాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం తహసీల్దారు చిట్టిబాబు, డీటీలు, ఆర్ఐలు, వీఆర్వోలతో సమావేశమై స్థానిక స్థితిగతులను తెలుసుకున్నారు.

తల్లిపాలే బిడ్డకు ఆరోగ్యం

గంగవరం, ఆగస్టు5: గంగవరం వైద్యాధికారి డాక్టర్ శ్రీనివా సులు ఆధ్వర్యంలో గంగవరం పీహెచ్‌సీ వైద్యసిబ్బంది గ్రామంలో తల్లిపాల ప్రాముఖ్యతపై ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ లహరి, సూపర్‌వైజర్ జ్యోతీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

బిందుసేద్యం పరికరాలకు దరఖాస్తుల ఆహ్వానం

శాంతిపురం, జులై 5 : బిందుసేద్యం పరికరాల కోసం అర్హులైన చిన్న సన్న కారు రైతులు రైతు సేవా కుంద్రాలలో పేర్లు నమోదు చేసుకోవాలని ఏపీ ఎంఐపీ, ఎంఐఏవో సాయి శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. దరఖాస్తు చేసుకొనే రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంక్ పుస్తకం జెరాక్స్ కాపీలు తీసుకుని వెళ్లి రైతు సేవా కేంద్రాలలో ఉన్న సహాయకులకు ఇచ్చి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. 5 ఎకరాలు అంతకంటే తక్కువ భూమి ఉన్న రైతులకు 90 శాతం, 5 -10 ఎకరాల భూములు ఉన్న రైతులకు 70 శాతం ప్రభుత్వం రాయితీ ఇస్తుందని వివ రించారు. అలాగే స్ప్రింక్లర్లు కావలసిన రైతులకు కూడా ప్రభుత్వం 5 ఎకరాల లోపల 55 శాతం, 5 -10 ఎకరాలు సన్న, చిన్న కారు రైతులకు 45 శాతం రాయితీ కల్పి స్తుందని తెలిపారు. వివరాలకు 7995072130 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

8న శాంతిపురం మండల సమావేశం

శాంతిపురం, జులై 5 : శాంతిపురం మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 8వ తేదీన మండల సచివాలయంలోని సమావేశ మందిరంలో ఎంపీపీ వసుంధర అధ్య క్షతన జరగనున్నట్లు ఎంపీడీవో డాక్టర్ మైథిలి తెలిపారు. మండల అభివృద్ధిపై శాఖల వారీగా సమీక్ష చేస్తామని తెలియజేశారు. ఈ సమావేశానికి ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. మండల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల ప్రజా ప్రతినిధులు, కుప్పం నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, మండల అధికారులు తప్పకుండా హాజరుకావాలని కోరారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత పుస్తకాల పంపిణీ

పలమనేరు, ఆగస్టు5 : పలమనేరు మండలం నక్కపల్లి గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి ఇందుజ్ఞానవేదిక సభ్యులు ప్రచార కార్యక్రమం నిర్వహించారు. భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇందుజ్ఞానవేదిక బంగారుపాళ్యం, పలమనేరు కమిటీ అధ్యక్షులు భాస్కర్, డి.బాలాజి, సభ్యులు జ్యోతి, రేఖ, కళ్యాణి, హేమంత్ పాల్గొన్నారు.

నీటి నాణ్యత పరిశీలన



పెద్దపంజాణి, ఆగస్టు 5: పెద్దపంజాణి మండలంలోని కోగిలేరు పంచాయతీలో నీటి నాణ్యతను కేంద్ర బృందం రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో పరిశీలించింది. సోమవారం జల జీవన్ మిషన్ ఆధ్వర్యంలో ఈ బృందం కోగిలేరు, బసవరాజు కండ్రిగ, పొట్టగానిపల్లె గ్రామాలలో పర్యటించి మంచినీటి ట్యాంకులు, గ్రామాలలోని నీటి తొట్టెలు, పాఠశాలల వద్ద ఉన్న ట్యాంకులను పరిశీలించారు. తాగునీటి నాణ్యత పాటించాలని సూచించారు. దీంతో సీజనల్, అంటురోగాలను దూరం చేయవచ్చునన్నారు. ఈ నెల 14 వరకు మండలంలో అన్ని గ్రామాలలో పర్యటించి తాగునీటి నాణ్యతను పరిశీలిస్తామన్నారు. అదే విధంగా గ్రామీణ ప్రాంతాలలో తాగునీటి కోసం ప్రజలకు కావాల్సిన మౌలిక సదు పాయాలను నమోదు చేసుకుని ఉన్నతాధికారులకు నివేదికలు సమర్పిస్తామన్నారు. కేంద్ర బృందంతో స్థానిక సర్పంచ్ రమేష్‌బాబు, సుధాకర్, పంచాయతీ కార్యదర్శి మహేశ్వర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హేమలత, ఇంజనీరింగ్ అసిస్టెంట్ వనజ తదితరులు ఉన్నారు.

మంత్రికి వినతుల వెల్లువ

పుంగనూరు రూరల్, ఆగస్టు5: పుంగనూరులో మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి వివిధ సమస్యలపై విన్నతులు వెలువలా వచ్చాయి. హోంగార్డులు ఇతర రాష్ట్రాలకు బదిలీ చేయడం వల్ల తాము ఇబ్బందులు పడుతామని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో హసేన్, చిన్న రెడ్డెప్ప, నాగేంద్ర, రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు. పుంగనూరు ఎన్జీవో భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరారు. బాబురాజేంద్రప్రసాద్, మధుబాల, నాగేనాయక్ తదితరులు పాల్గొన్నారు. పుంగనూరులో వైసీపీ నాయకులు ప్రభుత్వ భూములు, వంకలు ఆక్రమిస్తున్నారని బీజేపీ నాయకులు అయూబ్‌ఖాన్, నరసింహులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

న్యాయం కోసం నిరసన

బైరెడ్డిపల్లె, ఆగస్టు 5 : ఎన్నో ఏళ్లుగా తాము సాగుచేసుకుంటున్న భూమిని గ్రామంలో కొందరు ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని దీనిపై విచారణ జరిపి న్యాయం చేయాలని మండలం లోని తాతిరెడ్డిపల్లెకు చెందిన వెంకటలక్ష్మమ్మ వారి కుటుంబీకులు కోరారు. దళిత సంఘ నాయ కులతో కలసి సోమవారం వారు స్థానిక రెవిన్యూ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. న్యాయం చేయాలని తహసీల్దార్ మాధవరాజుకు వినతిపత్రాన్ని అందజేశారు. పూర్తి విచారణ జరిపి న్యాయం చేస్తామని తహసీల్దార్ వారికి హామీ ఇచ్చారు.

తహసీల్దార్‌కు రేషన్‌డీలర్ల సన్మానం

బైరెడ్డిపల్లె, ఆగస్టు 5 : బైరెడ్డిపల్లె తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన మాధవరాజును సోమవారం రేషన్ డీలర్లు మర్యాదపూర్వకంగా కలసి సన్మానించారు. అలాగే వీఆర్వోలు, రెవిన్యూ కార్యాలయ సిబ్బంది కూడా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీలర్ల సంఘ నాయకుడు రవిచంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అక్రమాలపై ఎంపీడీవోకు ఫిర్యాదు

బైరెడ్డిపల్లె, ఆగస్టు 5 : మండలంలోని మేకలనాగిరెడ్డిపల్లె సమీపంలోని చెరువువద్ద ఉపాధి పనులను యంత్రాలతో చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ధర్మపురి సర్పంచ్ బాలకృష్ణ సోమవారం ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన


బైరెడ్డిపల్లె, ఆగస్టు 5 : మండలంలోని దాసార్లపల్లె గ్రామంలో సోమవారం తీర్థం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆరోగ్యవిద్యాధికారి కాంతమ్మ సీజనల్ వ్యాధుల నివారణ గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ నవీన, ఏఎన్ఎం కవిత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో వరుస చోరీలు

పుంగనూరు రూరల్, ఆగస్టు5: గూడూరుపల్లె సమీపంలోని జగనన్న కాలనీలో వారం రోజులుగా వరుస చోరీలు జరుగుతున్నాయి. గుర్తుతెలియని వ్యక్తులు తాళాలు ఉన్న ఇళ్లను గుర్తించి చోరీలకు పాల్పడుతున్నారు. కాలనీకి చెందిన పరమేశ్, ఈశ్వర్ ఇళ్లలో ఏర్పాటు చేసిన విద్యుత్ వైర్లు, మౌలా చికెన్ సెంటర్‌లో రెండు సిలిండర్లు, కోళ్ల శుభ్రం చేసే యంత్రం, ఆదినారాయణ దుకాణంలో విద్యుత్ వైర్లు చోరీచేశారు. పోలీసులు చోరీలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

సీతమ్మ చెరువును కాపాడండి

మంత్రికి ఆవులపల్లె రిజర్వాయరు బాధితుల వినతి



పులిచెర్ల మండలం కల్లూరులో మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని, ఇన్‌చార్జ్ చల్లా బాబురెడ్డికి సన్మానం

పుంగనూరు, ఆగస్టు 5: సీతమ్మచెరువును గతంలోలాగే చెరువుగానే ఉంచాలని దానిపై ఆవులపల్లె రిజర్వాయర్ నిర్మాణం వద్దని ఆయకట్టు రైతులు మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డిని కోరారు. మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డితో కలిసి సోమవారం పుంగనూరు నియోజకవర్గ పర్యటన చేపట్టారు. రొంపిచెర్ల, కల్లూరు, సదుం, సోమల మండలం ఆవులపల్లె, చౌడేపల్లె, పుంగనూరులో ఆయనకు అడుగడుగునా టీడీపీ శ్రేణులు నీరాజనం పలికారు. సోమల మండలం ఆవులపల్లె సమీపంలోని సీతమ్మ చెరువు కట్టను ఆవులపల్లె రిజర్వాయర్ కోసం తొలగించిన ప్రాంతాన్ని మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయకట్టు రైతులు మంత్రితో మాట్లాడారు. ఆవులపల్లె రిజర్వా యర్‌ను నిర్మించడం వలన తమ పొలాలు ముంపునకు గురవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి స్పందిస్తూ గతంలో వల్లే సీతమ్మ చెరువును పునరుద్ధరిస్తామని, ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీఇచ్చారు. గత ఏడాది చంద్రబాబు పర్యటనలో జరిగిన ఘర్షణకు సంబంధించి తప్పుడు కేసులతో ఇబ్బందులు పడుతున్న బాధితులు మంత్రిని కలిసి కేసులు ఎత్తేసేలా చూడాలని కోరారు. ఇదిలా ఉండగా చౌడేపల్లె, సోమల, పుంగనూరులో మంత్రికి అపూర్వ స్వాగతం లభించింది. పుంగనూరులోని ఎన్టీఆర్ సర్కిల్‌లో తెలుగుదేశం పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అంతకుమందు మోటార్ సైకిల్ ర్యాలీ చేపట్టారు. చౌడేపల్లె మండల టీడీపీ అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక వాయిద్యాలు, భారీ స్థాయిలో స్వాగత ఏర్పాట్లు చేపట్టారు.

మంత్రికి అపూర్వ స్వాగతం

కల్లూరు, ఆగస్టు 5: పులిచెర్ల మండలం కల్లూరులో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఇన్‌చార్జ్ చల్లా బాబురెడ్డిని టీడీపీ నాయకులు కొండా మురళి, పూల రమేష్ ఆధ్వర్యంలో గజమాలలతో సన్మానించారు. పట్టణానికి చెందిన టీడీపీ నాయకులు పుట్టా రమేష్‌శెట్టి, పుట్టా అనీల్ కుమార్ ఇంటికి వెళ్లిన మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఇన్‌చార్జ్ చల్లా బాబురెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు మురళీధర్, టీడీపీ నాయకులు రామనాథం నాయుడు, ముల్లంగి వెంకట రమణ, కుమార్ రెడ్డి, సుబ్బారెడ్డి, రవినాయుడు పాల్గొన్నారు.

రొంపిచెర్ల: మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి రొంపిచెర్లలోని చల్లారామచంద్రారెడ్డి ఇంటికి వచ్చారు. నాయకులు, కార్యకర్తలు మంత్రిని, చల్లాబాబును సత్కరించారు. ఈకార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షుడు ఉయ్యాలరమణ, ఐ-టీడీపీ నియోజక వర్గం అధ్యక్షుడు హరిబాబు పాల్గొన్నారు.

సదుం: సదుంలో టీడీపీ శ్రేణులు మంత్రికి, చల్లాబాబు ఘనస్వాగతం పలికారు. పలువురు వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీనివాసులురెడ్డి, మహేశ్వర రెడ్డి, రెడ్డిప్రసాద్ రెడ్డి, నారాయణ గౌడ్, కృష్ణయ్య, పవన్, అమర కార్యకర్తలు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు అప్రజాస్వామికం



మాట్లాడుతున్న యమలా సుదర్శన్

పలమనేరు, ఆగస్టు5 : ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అప్రజాస్వామిక మని, రాజ్యాంగ విరుద్ధమని మాల మహానాడు నాయకులు యమలా సుదర్శనం పేర్కొన్నారు. సోమవారం ఆయన పలమనేరులోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మాలమహానాడు నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు ఒకటో తేదీన వచ్చినది ప్రధాని మోదీ ప్రభావిత తీర్పు అని ఆరోపించారు. గత ఫిబ్రవరిలో సుప్రీంకోర్టు తీర్పును రిజర్వుచేసి ఎన్నికల తరువాత ఇప్పుడు అప్రజాస్వామికంగా తీర్పుచెప్పడమే ఇందుకు సాక్ష్యమని పేర్కొన్నారు. ఈ తీర్పును యావత్ మాలలు ఖండి స్తున్నారని ఈ తీర్పుకు వ్యతిరేకంగా తాము ఉద్యమిస్తామని స్పష్టంచేశారు. పలమనేరులో కూడా త్వరలో ఆందోళన చేస్తామని ప్రజాజీవనాన్ని స్తంభింపజేస్తామని హెచ్చ రించారు. క్రిమిలేయర్‌ను ఎస్సీలకు వర్తింపజేయాలనడం దళితులను మరింత అణగదొక్కడమేనని అభిప్రాయపడ్డారు. నేటికీ దేశంలో అంటరానితనం కొనసాగుతోందని, చివరకు రాష్ట్రపతి కూడా కొన్ని ఆలయాల్లోకి వెళ్లలేని పరిస్థితి ఉందని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తీర్పుపై తాము రివ్యూ పిటిషన్ వేస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో స్థానిక మాలమహానాడు నాయకులు గ్యాస్‌భాస్కర్, జయకుమార్(జేకే), చిన్నా, తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల కట్టడికి పటిష్ట చర్యలు : డీఎస్పీ



కుప్పం డీఎస్పీ పార్థసారథి

కుప్పం, ఆగస్టు 5: కుప్పంలో మాదక ద్రవ్యాల రవాణా, వినియోగ కట్టడికి పటిష్టమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ బి.పార్థసారథి అన్నారు. ఆయన సోమవారం కుప్పం డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తనను కలిసిన విలేకరులతో డీఎస్పీ మాట్లాడారు. విజయవాడ స్పెషల్ బ్రాంచిలో ఏసీపీగా పనిచేసిన తనకు యాంటీ నార్కొటిక్స్ టీంను లీడ్ చేసిన అనుభవం ఉందన్నారు. కుప్పంలో గత ఐదేళ్ల కాలంలో మాదక ద్రవ్యాల రవాణా పెరిగిందని తెలిసిందన్నారు. కుప్పం, మల్లానూరు ప్రాంతాల్లో ఉన్న రైల్వే స్టేషన్లకు రైళ్ల ద్వారా డ్రగ్స్ కుప్పం డివిజన్‌లోకి రవాణా అవుతున్నట్లు ప్రాథమిక సమాచారం ఉందన్నారు. డ్రగ్స్ రవాణా చేస్తున్నవారిని, వినియోగిస్తున్నవారిని గుర్తించడానికి పూర్తిస్థాయి నిఘా పెడతామని చెప్పారు. ప్రజలు కూడా తమకు సహకరించాలని కోరారు. శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయం మేరకు ప్రశాంత కుప్పం కలను సాకారం చేస్తానని డీఎస్పీ పార్థసారథి తెలిపారు.

శ్మశాన వాటిక దారి సమస్య పరిష్కరించండి : కడా పీడీ

కుప్పం, ఆగస్టు 5: కుప్పం మండలం శీగలపల్లెకు చెందిన ఎస్సీ కాలనీ శ్మశానానికి దారి లేదని, దారి కల్పించాలని కాలనీ వాసులు సోమవారం కడా పీడీ వికాస్ మర్మత్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన పీడీ సాయంత్రం శీగలపల్లెకు రెవెన్యూ సిబ్బందితో కలిసి వెళ్లారు. దారి లేకపోవడాన్ని స్వయంగా పరిశీలించారు. సర్వేచేసి శ్మశానికి గ్రావెల్ రోడ్డు నిర్మించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. రోడ్డు నిర్మాణానికి ఒక లక్ష రూపాయలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

శీతల గిడ్డంగి నిర్మాణం పూర్తిచేస్తాం : కంచర్ల



శీతల గిడ్డంగిని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల, రాజ్‌కుమార్ తదితరులు

కుప్పం, ఆగస్టు 5: కుప్పం వ్యవసాయ మార్కెట్ యార్డులో శీతల గిడ్డంగి నిర్మాణం పూర్తి చేస్తామని ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్ తెలియజేశారు. సోమవారం ఆయన టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్‌తో కలిసి మార్కెట్ యార్డును పరిశీలించారు. రైతులను అడిగి సమస్యలు తెలుసు కున్నారు. శీతలగిడ్డంగి నిర్మిస్తే ధర వచ్చినప్పుడు అమ్ముకోవచ్చని రైతులు ఆయనకు తెలియజేశారు. స్పందించిన ఆయన అసంపూర్తిగా ఉన్న శీతల గిడ్డంగిని పరిశీలించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడి గిడ్డంగి నిర్మాణం పూర్తి చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో ఎంసీఏ విద్యార్థి మృతి



సాయికిరణ్ (ఫైల్‌ఫొటో)

పెద్దపంజాణి, ఆగస్టు 5: రోడ్డు ప్రమాదంలో ఎంసీఏ విద్యార్థి మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కోగిలేరు పంచాయతీ బసవరాజుకండ్రిగ గ్రామానికి చెందిన వెంకట్రమణ కుమారుడు సాయికిరణ్(23) మదర్ థెరిసా కళాశాలలో ఎంసీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం ఉదయం కళా శాలకు ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. పలమనేరు - పుంగనూరు జాతీయ రహదారిలోని ఒంటిల్లు సమీపంలో పలమనేరు వైపు నుంచి వస్తున్న స్కూల్ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో సాయికిరణ్ తీవ్ర గాయాల పాల య్యాడు. గాయపడ్డ అతడిని స్థానికులు పలమనేరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతుడు సాయికిరణ్ ఒకే కుమారుడు కావడంతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పెద్దపంజాణి పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆర్టీసీ డిపో ఎదుట పీపీఎస్ నిరసన

పలమనేరు, ఆగస్టు5 : పలమనేరు ఆర్టీసీ డిపో మేనేజర్ కార్యాలయం వద్ద సోమవారం పలమనేరు పరిరక్షణ సమితి (పీపీఎస్) ఆధ్వర్యంలో నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిపోలోని 50 శాతం బస్సులను పుంగనూరు, మదనపల్లి, చిత్తూరు డిపోలకు తరలించి కేవలం పల్లెవెలుగు బస్సులను ఇక్కడ నడుపుతున్నారని తెలి పారు. ఉదయం 4 నుంచి వేచిఉన్నా 6గంటల వరకు కూడా చిత్తూరు, తిరుపతి వెళ్లేందుకు బస్సులు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఉదయాన్నే తిరుపతి లోని స్విమ్స్, వేలూరులోని సీఎంసీ, నర్సీ, వంటి ఆస్పత్రులకు వెళ్లేం దుకు అవస్థలు పడుతున్నారని వివరిం చారు. ఈ విషయమై పలుమార్లు డిపో అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించు కోలేదని విచారం వ్యక్తంచేశారు. ఇకనైనా అధికారులు స్పందించి ప్రజలకు అను కూలంగా బస్సులు నడపాలని కోరారు. అనంతరం డిపో అధికారులకు వినతిపత్రం సమర్పించారు.



నిరసన వ్యక్తం చేస్తున్న పీపీఎస్ నాయకులు

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ



తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

గంగవరం, ఆగస్టు5 : గంగవరం ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా శివకుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న లోకేశ్వరరావు సెలవులో ఉండడంతో నెల రోజుల నుంచి తహసీల్దార్ పోస్టు ఖాళీగా ఉంది. ఈ క్రమంలో చిత్తూరు డీఎస్ఓ కార్యాలయంలో డీటీగా పనిచేస్తున్న జీఎల్.శివకుమార్‌ను ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా బదిలీ చేశారు. గంగవరం టీడీపీ మండల అధ్యక్షులు సోమశేఖర్‌గౌడు, ప్రతాప్‌రెడ్డి, ప్రసాద్‌నాయుడు, వెంకటేష్‌నాయుడు, యుగంధర్, గిరి, బాలాజి, జయసింహ తదితరులు కలసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

శ్రావణ సోమవార పూజలు

రామకుప్పం, ఆగస్టు 5: రామకుప్పంలోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో సోమవారం శ్రావణ సోమవార పూజలు ఘనంగా జరిగాయి. ఉదయం స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించి విశేష అలంకరణలు చేశారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

చౌడేశ్వరమ్మకు విశేషపూజలు



గ్రామవీధుల్లో ఊరేగుతున్న చౌడేశ్వరమ్మ

రామకుప్పం, ఆగస్టు 5: రామకుప్పం మండలం సగినేకుప్పం గ్రామంలోని చౌడేశ్వరమ్మ ఆలయంలో ఆదివారం రాత్రి తొగటవీర క్షత్రియులు అమ్మవారి జయంతిని ఘనంగా నిర్వహించారు. సర్వాలంకార భూషితురాలైన అమ్మవారిని గ్రామవీధుల్లో ఊరేగించారు. నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తొగటవీరక్షత్రియ ప్రముఖులు భాస్కర్, మునస్వామి, సుబ్రహ్మణ్యం, మంజునాథ్, హరికృష్ణ, సుధాకర్, జయప్ప, నారాయణస్వామి, గోపీనాథ్ పాల్గొన్నారు.

కళాశాలను అభివృద్ధి చేస్తాం

పుంగనూరు రూరల్, ఆగస్టు5: స్థానిక శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు పేర్కొన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ కళాశాల చుట్టూ ప్రహరీ నిర్మాణం, ప్రధాన రోడ్డు నుంచి సీసీ రోడ్డు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కళాశాల వ్యవస్థాపకుడి విగ్రహం ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ప్రిన్సిపాల్ రాజశేఖర్, శుభారాం ట్రస్ట్ ఛైర్మన్ శ్రీనివాసులు, రెడ్డెప్ప, కమిటీ సభ్యులు భక్తవత్సలరాజు, రెడ్డెప్పరెడ్డి, బాలసుబ్రహ్మణ్యం, శేషప్పగుప్తా, రంగనాయకులు, హరినాథరెడ్డి, ప్రసాద్, అధ్యాపకులు శ్రీనివాస్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

పీఆర్సీ బకాయిలు వెంటనే చెల్లించాలి

పుంగనూరు రూరల్, ఆగస్టు 5: రాష్ట్ర ప్రభుత్వం విశ్రాంత ఉద్యోగులకు చెల్లించాల్సిన పీఆర్సీ బకాయిలు వెంటనే చెల్లించాలని ఆ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక విశ్రాంత ప్రజా భవన్‌లో జరిగిన సమావేశంలో సంఘ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు చెంగారెడ్డి, రామకృష్ణారెడ్డి మాట్లాడారు. 12వ ఆర్సీ ఏర్పాటు చేసి ఐఆర్‌ను ప్రకటించాలన్నారు. ఈ సమావేశంలో సంఘనాయకులు చంద్రశేఖర్, కేశవరెడ్డి, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం



మాట్లాడుతున్న సీడీపీవో కల్పన

శాంతిపురం, జులై 5 : తల్లి పాలతోనే బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని శాంతిపురం సీడీపీవో కల్పన అన్నారు. సోమవారం మండల పరిధిలోని అరిముత్తనపల్లె అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. బిడ్డల తల్లులతో సమావేశం నిర్వ హించి తల్లిపాల ప్రయోజనాల గురించి వివరించారు. సూపర్‌వైజర్లు కృష్ణవేణి, సుగుణ, ఎంఎల్‌హెచ్‌పి పూజ, అంగన్వాడి టీచర్లు రేవతి పాల్గొన్నారు.

కుప్పం రూరల్: తల్లిపాలే శిశువుకు ఆరోగ్యమని ప్రభుత్వ వైద్యాధికారులు డాక్టర్ దీప్‌కుమార్, డాక్టర్ సుభాష్‌రాజ్, జశ్వంత్, కిషోర్ అన్నారు. మండలంలోని చీలేపల్లె పంచాయతీ పరిధిలోని వడ్డిపల్లెలో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయా పీహెచ్‌సీల సిబ్బంది, ఐసీడీఎస్ సిబ్బంది, కుప్పం నర్సింగ్ కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదుల కార్యక్రమానికి ఐదు వినతులు

చిత్తూరు, ఆగస్టు 5: నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఐదు వినతులు అందినట్లు సహాయ కమిషనర్ రామకృష్ణుడు చెప్పారు. ఆయన బాధితుల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. మెప్మాకు 02, రెవెన్యూకు 02, ప్రజారోగ్యం విభాగానికి 01 వినతులు వచ్చాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌వో అనిల్‌కుమార్ నాయక్, మేనేజర్ గోపాలకృష్ణ వర్మ పాల్గొన్నారు.

సామాజిక సేవే సాయిసేవ


మొక్కలు నాటుతున్న ఆర్గనైజేషన్ సభ్యులు

నగరి, ఆగస్టు 5: సామాజిక సేవే సాయి సేవ అని సత్యసాయి సేవా ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షుడు మధుసూదన పేర్కొన్నారు. నగరి మండల పరిధిలోని తడుకుపేట సాయి శివాలయంలో సోమవారం గోపూజ, అష్టోత్తర పూజలు, భజన నిర్వహించారు. మహా మంగళ హారతి అనంతరం అన్నదానం చేశారు. భజన మండలి ఆవరణలో మొక్కలు నాటారు. మధుసూదన మాట్లాడుతూ మొక్కల పెంపకం పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందన్నారు. సత్యసాయి సేవా ఆర్గనైజేషన్ సభ్యులకు లిఖిత నామ జప పుస్తకాలు పంపిణీ చేశారు. తడుకుపేట ఆర్గనైజేషన్ కన్వీనర్ వెంకటరమణ, సభ్యులు నాగేశ్వర్, లీలారామ్, అవకుమార్, శ్రీదేవి పాల్గొన్నారు.

వైభవంగా బకాసుర కుంభం



నగరి, ఆగస్టు 5: చింతపట్టెడలో నిర్వహిస్తున్న ద్రౌపది తిరునాళ్లలో భాగంగా సోమవారం బకాసుర కుంభం కార్యక్రమాన్ని నిర్వహించారు. భీముడు బకాసురుడికి బండిపై కుంభం తీసుకెళ్లే ఘట్టాన్ని నిర్వహించారు. ఉత్సవ నిర్వాహకులు నటరాజన్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. స్థానిక భక్తుడు సత్యనారాయణన్ ఉభయదాతగా వ్యవహరించారు. రాత్రి ఆలయంలో మహాభారత పారాయణం నిర్వహించారు.

11న ఉభయదారుల సమావేశం

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 5: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు దగ్గర పడుతుండడంతో 14 గ్రామాలకు చెందిన ఉభయదారులతో ఈ నెల 11న ఎమ్మెల్యే మురళీమోహన్ నేతృత్వంలో సమావేశం నిర్వహించనున్నట్లు ఈవో వెంకటేశు తెలిపారు. మణికంఠేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించనున్న ఈ సమావేశానికి ఉభయదారులు తప్పకుండా హాజరై బ్రహ్మోత్సవాల నిర్వహణకు సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు.

తాగునీటి సమస్య పరిష్కారం

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 5: నగరంలోని 28వ డివిజన్ వినాయకపురం ప్రజల తాగునీటి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ బోరు వేయించారు. గంగినేని చెరువు దగ్గర బోరు వేయించడం, నీరు పుష్కలంగా పడడంతో సమస్య పరిష్కారమైందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, స్థానికులు తెలిపారు.

హైవే అధికారుల నిర్లక్ష్యం..ఇళ్లలోకి నీరు


ఇంటి ముందు నీటిని చూపుతున్న బాధితుడు

గుడిపాల, ఆగస్టు 5: మండలంలో బెంగళూరు - చెన్నై జాతీయ రహదారి పనులను అసంపూర్తిగా వదిలేయడంతో కొద్దిపాటి వర్షానికే ఇళ్లలోకి నీరు వస్తున్నాయని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ తెలిపారు. ఈ విషయాన్ని పలుమార్లు నేషనల్ హైవే అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. దీనికితోడు హైవేలో ఎక్కడ చిన్న ప్రమాదం జరిగినా ఇక్కడ వాహనాలను అనుమతించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ



విజయపురం, ఆగస్టు 5: తహసీల్దార్‌గా కిరణ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న మల్లికార్జునరావ్ బదిలీపై వెళ్లారు. చిత్తూరులో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న కిరణ్‌కు అదనపు బాధ్యతలతో విజయపురానికి పంపారు. మండలంలో రెవిన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. డీటీ అశోక్, సర్వేయర్ శేఖర్ శుభాకాంక్షలు తెలిపారు.

అంకాళమ్మ సేవలో ఎమ్మెల్యే భానుప్రకాష్


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఆనందరాజు, గ్రామస్తులు

నింద్ర, ఆగస్టు 5: మండలంలోని ఆరూరు పంచాయతీ పాత ఆరూరు అంకాళమ్మ ఆలయంలో సోమవారం నిర్వహించిన కొలుపు ఉత్సవంలో నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేయించారు. టీడీపీ మండల ఉపాధ్యక్షుడు ఆనందరాజు, గ్రామస్తులు ఆయన్ను సన్మానించారు.

తహసీల్దారుకు సన్మానం



నింద్ర, ఆగస్టు 5: తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టిన శేషగిరిరావును టీడీపీ నాయకులు సోమవారం సన్మానించారు. మండలంలో రెవిన్యూ సమస్యలు పరిష్కరించి, అందరికీ న్యాయం చేయాలని కోరారు.

11న ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమం

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 5: మిట్టూరు రెవెన్యూ గెస్ట్ హౌస్‌లో ఈ నెల 11వ తేదీన ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రాజరత్నం రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాల బాలికలకు సంగీత, నృత్య పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు ఇస్తామని పేర్కొన్నారు.

మోదీ ప్రభావిత తీర్పును అంగీకరించం

- మాల మహానాడు జిల్లా అధికార ప్రతినిధి రవి

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 5: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు వెనుక ప్రధాని మోదీ ప్రభావముందని, దాన్ని అంగీకరించే ప్రసక్తే లేదని మాల మహానాడు జిల్లా అధికార ప్రతినిధి కె.కె.రవి పేర్కొన్నారు. రాజ్యాంగంలోని 341, 14 ఆర్టికల్స్ ప్రకారం ఎస్సీ వర్గీకరణ సరికాదని తెలిపారు. వర్గీకరణ అమలు చేయాలంటే అన్ని రాష్ట్రాలు ఆమోదం తెలపాలని, పార్లమెంట్‌లో 1/3 వంతు సభ్యులు తీర్మానాన్ని ఆమోదించాలని వివరించారు.

9న ఎల్లమ్మ పుష్పపల్లకి సేవ

యాదమరి, ఆగస్టు 5: మండలంలోని కీనాటంపల్లె ఎల్లమ్మ తల్లి పుష్పపల్లకి సేవ ఈనెల 9వ తేదీ నిర్వహిస్తున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారికి అభిషేకం, పొంగళ్లు, సాయంత్రం పుష్పపల్లకి సేవ ఉంటాయని తెలిపారు. 10న మధ్యాహ్నం వసంతోత్సవం ఉంటుందని వెల్లడించారు.

ఇలాగేనా ప్రజారోగ్య పరిరక్షణ..!

- తాగునీటి పైపులన్నీ మురుగునీటి కాలువల్లోనే..
- ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం




బ్రాహ్మణవీధిలో మురుగుకాలవలో ఉన్న తాగునీటి పైపులు - బజారు వీధిలో తాగునీటి పైపులైన్ - రామ్‌నగర్ ఎక్స్‌టెన్షన్ వీధిలో రోడ్లపై పారుతున్న మురుగు నీరు

చిత్తూరు రూరల్, ఆగస్టు 5: 'నగర అభివృద్ధికి శ్రమిస్తున్నాం... స్మార్ట్ సిటీగా మారుస్తున్నాం...' అంటూ అటు నాయకులు, ఇటు అధికారులు ఊదరగొడుతుంటారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను చూస్తే ఆ దిశగా ఒక్క అడుగు కూడా పడడం లేదన్న వాస్తవం బోధపడుతుంది. ఏళ్ల క్రితం ఏర్పడిన కాలనీల్లో డ్రైనేజీలు లేకపోవడంతో మురుగు రోడ్లపై పారుతూ రోగాలను ఆహ్వానిస్తున్నాయి. నగరంలో సగానికిపైగా తాగునీటి పైపులు మురుగు కాలువల్లోనే ఉన్నాయి. తద్వారా తాగునీరు కలుషితమవుతున్నాయి. వాటిని తాగిన నగర ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. రంగాచారి వీధి, బ్రాహ్మణవీధి, బజారువీధి, వీరభద్రకాలనీ, తేనెబండ తదితర ప్రాంతాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. దీనిపై అనేక మార్లు అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రామ్‌గనర్ ఎక్స్‌టెన్షన్, జానకారపల్లి ఎక్స్‌టెన్షన్, సత్యనారాయణపురం, ప్రశాంత్‌నగర్, వైఎస్సార్ కాలనీ, మురకంబట్టు ఇందిరమ్మకాలనీల్లో కాలువలు లేక రోడ్లపైనే మురుగు పారుతూ స్థానికులను రోగాలపాలు చేస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఏళ్ల తరబడి సమస్య.. 24 గంటల్లో పరిష్కారం


తాగునీటి బోరుకు విద్యుత్ కనెక్షన్ ఇస్తున్న అధికారులు

ఐరాల(కాణి పాకం), ఆగస్టు 5: ఏళ్ల తరబడి తిష్ట వేసిన సమస్యలను 24 గంటల్లో పరిష్కరించి పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ ప్రజల నుంచి ప్రశంసలు అందుకున్నారు. ఆదివారం ఐరాల ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కాణిపాక పరిసర గ్రామాలలో విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయంగా ఉందని అధికారులు ఎమ్మెల్యేకు చెప్పారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు స్థలాభావం ఉండడంతో సమస్య పరిష్కారం కావడం లేదని తెలిసి, మణికంఠేశ్వర స్వామి ఆలయం పక్కనున్న పిళ్లారిచెరువులో పరిశీలించారు. ఆ ప్రాంతంలో వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. అలాగే ఐరాల పంచాయతీ గోవిందరెడ్డిపల్లె ఎస్టీ కాలనీలో మోటారు కేబుల్స్ మార్చి తాగునీటి సమస్యను పరిష్కరించారు.

విద్యుత్ అక్రమ కనెక్షన్‌దారులపై కేసులు


బసవాపల్లి సబ్‌స్టేషన్ వద్ద విజిలెన్స్ అధికారులు

గుడిపాల, ఆగస్టు 5: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. తిరుపతి విజిలెన్స్ ఈఈ పుల్లా బాలాజీ ఆధ్వర్యంలో విజిలెన్స్ అధికారులు మండలంలోని 33/11కేవీ సబ్‌స్టేషన్ కొత్తపల్లి, పాపసముద్రం, చిత్తపార, దిగువ పిళ్లారికుప్పం, తుమ్మలవారిపల్లి, చింతగుంటూరు, రామభద్రాపురం, చలిచీమలపల్లి, బొమ్మసముద్రం, కోటూరు, కమ్మతిమ్మాపల్లి, సింగారపేట, రామాపురం, కొత్తకోట, నారగల్లు గ్రామాల్లో తనిఖీలు చేశారు. అక్రమంగా విద్యుత్ వాడుతున్న 75 మందిపై కేసు నమోదు చేసి, రూ.3,32,000 జరిమానా విధించారు.

పండిట్లకు రివర్షన్ సరికాదు


డీఈవో కార్యాలయానికి వచ్చిన బాధిత పండిట్లు

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 5: కోర్టు ఉత్తర్వులతో స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందిన తమకు ఎస్జీటీ ల్యాంగ్వేజ్ పండిట్లుగా రివర్షన్ ఇవ్వడం సరికాదని బాధిత ఉపాధ్యాయులు డీఈవో దేవరాజుకు తెలిపారు. సోమవారం డీఈవోను కలిసి తమకు వచ్చిన పదోన్నతి విధానాన్ని వివరించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 30 మంది నిబంధనలు, కోర్టు ఉత్తర్వుల మేరకు ఎస్జీటీ ల్యాంగ్వేజ్ పండిట్ నుంచి 2019లో స్కూల్ అసిస్టెంట్ పండిట్లుగా పదోన్నతి పొందామన్నారు. తాజాగా శనివారం విడుదల చేసిన సీనియారిటీ జాబితాలో తమను ల్యాంగ్వేజ్ పండిట్లుగా చూపడం సరికాదన్నారు. స్పందించిన డీఈవో తగు న్యాయం చేస్తానని తెలిపారు. డీఈవోను కలిసిన వారిలో కదిరి రవి, సురేంద్ర బాబు, కవిత, చంద్రకళ, రెడ్డెప్ప, అనూషా, లత, షైమున్నిషా, నీలిమా, హెస్సిబా, శ్రీలేఖ, వినయకుమారి, లక్ష్మి ఉన్నారు.

పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ విజయులు రెడ్డి

కార్వేటినగరం, ఆగస్టు 5: యువత పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని, వాటి నిషేధంలో భాగస్వామ్యం కావాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర ఎస్.విజయులు రెడ్డి కోరారు. సోమవారం కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్, రాస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పొగాకు, మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే నష్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ధనంజయరెడ్డి, రాస్ అధికారి నాగరాజు మాట్లాడు తూ విద్యార్థి దశలో మత్తుకు బానిసలు కావద్దని సూచించారు. రాస్ అధికారులు దామోదరం, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎస్సీ వసతి గృహంలోకి వర్షపు నీరు

- విద్యార్థినులను ప్రైమరీ స్కూల్‌కు తరలింపు



వసతి గృహం నుంచి బయటకు వస్తున్న నీరు - విద్యార్థినులను తరలిస్తున్న గ్రామస్తులు

బంగారుపాళ్యం, ఆగస్టు 5: మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల వసతి గృహంలోకి వర్షపు నీరు చేరింది. సోమవారం సాయంత్రం 4 గంటల నుంచి సుమారు రెండు గంటల పాటు ఏకధాటిగా వర్షానికి తగ్గువారిపల్లె కుంట నుంచి వెంకటప్పనాయుని చెరువుకు వెళ్లే ఇరిగేషన్ కాలువ ఉప్పొంగి నీరు వసతి గృహంలోకి ప్రవేశించింది. విద్యార్థులు భయాందోళనతో పరుగులు తీశారు. స్థానికులు ధైర్యం చెప్పి వారిని పక్కనే ఉన్న ప్రాథమిక పాఠశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మి వసతి గృహానికి చేరుకుని విద్యార్థులతో మాట్లాడి అక్కడ ఉండడానికి ఆశ్రయం కల్పించారు. వెంకటప్పనాయుని చెరువుకు వెళ్లే కాలువ ఆక్రమణకు గురికావడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని స్థానికులు అంటున్నారు.

ముగ్గురు గ్రేడ్-5 సెక్రటరీల బదిలీ

పెనుమూరు, ఆగస్టు 5: మండలంలో గ్రేడ్-5 సెక్రటరీలు అధికంగా ఉండటంతో ముగ్గురిని ఎనిమిది నెలల ముందు సచివాలయాలకు కేటాయించారు. వారు వెళ్లకపోవడంతో ఎన్నికలకు ముందు కలెక్టర్ గుడిపాల మండలానికి బదిలీ చేశారు. అయితే ఆ ముగ్గురూ బీఎల్వోలుగా ఉండటంతో మండలం నుంచి రిలీవ్ చేయలేదు. సోమవారం చిప్పారపల్లి సెక్రటరీ తేజను గుడిపాల మండలంలోని కుప్పిగానిపల్లికి, చిన్నకలికిరి సెక్రటరీ యామినిని పానాటూరుకు, గుత్తావాండ్లపూరు సెక్రటరీ కుమార్‌చౌదరిని ఏఎల్‌పురానికి బదిలీ చేస్తూ ఎంపీడీవో వెంకటేశ్వర్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. వారి స్థానంలో చిప్పారపల్లికి సునీత, చిన్నకలికిరికి జన్మశ్రీ, గుత్తావాండ్లపూరుకు సురేంద్రలను ఇన్‌చార్జులుగా నియమించారు.

కలికిరి పంచాయతీ కార్యదర్శికి షోకాజ్ నోటీసు

పెనుమూరు, ఆగస్టు 5: మండలంలోని కలికిరి పంచాయతీ కార్యదర్శి గ్రేడ్-3 లావణ్యకు డీపీవో లక్ష్మీ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. నిధులు దుర్వినియోగం చేశారని ఓబయ్యగారిపల్లికి చెందిన యుగంధర్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టారు. ఖర్చు చేసిన నిధులకు బిల్లులు సక్రమంగా సమర్పించకపోవడంతో 7 రోజుల్లో వివరణ ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొన్నారు.

కొండ మల్లీశ్వరస్వామికి పాలాభిషేకం


ప్రత్యేక అలంకరణలో సిద్ధేశ్వరస్వామి

వెదురుకుప్పం, ఆగస్టు 5: డీఆర్ఎన్ కండ్రిగ సమీపంలో అరుణగిరి క్షేత్రంలో కొలువై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండ మల్లీశ్వర స్వామికి సోమవారం పాలాభిషేకం చేశారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదం అందించారు. ఆలయ ఆవరణలో అన్నమయ్య, శివనామ సంకీర్తనలను ఆలపించారు. ఎగువ కన్నికాపురం సమీపంలో ఉన్న స్వయంభు సిద్ధేశ్వరస్వామి ఆలయంలో సిద్ధేశ్వరుడికి పాలాభిషేకం, రుద్రాభిషేకం చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. చవటగుంట ఆవుదేవర నందీశ్వరుడికి రుద్రాభిషేకం నిర్వహించి, ప్రత్యేక పూజలు జరిపించారు.

విద్యాసామగ్రి వితరణ


విద్యాసామగ్రి అందిస్తున్న హెచ్‌ఎం పరమాత్మయ్య

వెదురుకుప్పం, ఆగస్టు 5: మండలంలోని మారేపల్లి కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం హెచ్‌ఎం పరమాత్మయ్య చేతుల మీదుగా విద్యా సామగ్రిని అందజేశారు. వెదురుకుప్పం తెలుగుదేశం పార్టీ నాయకుడు కామసాని చైతన్యకుమార్ రెడ్డి సాయంతో నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, ప్యాడ్‌లు అందించారు. టీడీపీ నాయకులు బండి విష్ణువర్ధన్‌రెడ్డి, కావలి భాస్కర్, కావలి మురళి, జనసేన నేత పురుషోత్తం హాజరయ్యారు.

టీడీపీ గేట్లు తెరిస్తే వైసీపీలో ఎవరూ ఉండరు

చిత్తూరు సిటీ, ఆగస్టు5: టీడీపీ గేట్లు తెరిస్తే వైసీపీలో ఏ ఒక్క నాయకుడూ మిగలరని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్ అన్నారు. సోమవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన మట్లాడుతూ వైసీపీ అరాచక, దోపిడీ పాలనతో విసిగిపోయిన ప్రజలు ఆ పార్టీని చిత్తుగా ఓడించారన్నారు. వైసీపీ అధినేత జగన్ వైఖరి నచ్చక ఇప్పటికే చాలామంది నేతలు ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారని అన్నారు. రాష్ట్రంలో ముఠాల పాలన కనిపిస్తోందని, రెండు నెలల్లో రాజకీయ హింసకు మారుపేరుగా మార్చారని జగన్ చెప్పడాన్ని ఖండిస్తున్నామని అన్నారు. గత వైసీపీ అరాచకపాలనపై బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. కూటమి ప్రభుత్వంపై వైసీపీ నేతలు ఎంత అసత్య ప్రచారం చేసినా ప్రజలు నమ్మరని అన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం


పాలసముద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీహెచ్‌వో జ్ఞానశేఖర్ తదితరులు

పాలసముద్రం, ఆగస్టు 5: బిడ్డకు తల్లి ముర్రుపాలు శ్రేయస్కరమని సీహెచ్‌వో జ్ఞానశేఖర్ తెలిపారు. సోమవారం పాలసముద్రం కాలనీలో తల్లిపాల వారోత్సవాలపై ర్యాలీ నిర్వహించారు. అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు సమతుల్య ఆహారం తీసుకోవాలని సూచించారు. తద్వారా శిశువులు ఆరోగ్యంగా ఉంటారన్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు అనురాధ, సంగీత, వైద్యశాఖ సూపర్‌వైజర్ మురళి, అంగన్‌వాడీ సిబ్బంది లత, జీవిత, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.


విజయపురం మండలం శ్రీహరిపురంలో అవగాహన ర్యాలీ

విజయపురం : మండలంలోని శ్రీహరిపురంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులు వెంకమరాజు మాట్లాడుతూ ముర్రుపాలు టీకాతో సమానమని, ఈ విషయాన్ని తల్లులు గ్రహించాలని అన్నారు. ఏఎన్ఎం చందన, అంగన్‌వాడీ కార్యకర్త సుజాత పాల్గొన్నారు.